


'ఉపాధి' కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ


ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

తిరుపతి జిల్లా తిరుపతి గ్రామీణ మండలం నందు గురువారం పెరుమాళ్ళ పల్లి, మల్లవరం గ్రామపంచాయతీ యందు జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందజేశారు. ఎండాకాలం పూర్తయ్యేవరకూ కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని అధికారి మమతారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్ రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటాచలపతి, మునేశ్వర్ గోపి పాల్గొన్నారు.



కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ చేస్తున్న అధికారులు

విద్య -2



బుక్స్ 'భారం'

పాఠ్య, నోటు పుస్తకాలపై 'ప్రైవేటు' హుకుం
యూనిఫాం, బెల్ట్, బ్యాడ్జీలపైనా ఆదేశాలు
వేలకు వేలు దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ

ప్రజాశక్తి- తిరుపతి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. గుర్తింపు పొందిన పాఠశాలల్లోనూ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంఈవో కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. ఇక నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు గంపగుత్తగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నగదు వసూలు చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు ధరలను వసూలు చేస్తున్నా, విద్యాశాఖ అధికారులు నోరు మెదపకపోవడంలో ఆంతర్యమేంటని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అలాగే నిబంధలకు విరుద్ధంగా యూనిపాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూలనూ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తుండటం గమనార్హం. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నారు. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్ , స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాదిరూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ అంటూ అందినకాడికీ దోచుకుంటున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1080 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో 559 ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మిగిలినవన్నీ ప్రైవేటు యాజమాన్యాల అధీనంలో ఉన్నాయి. వీటిలో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. మౌలిక వసతుల లేమి.., విద్యార్థులకు సరిపడా ఆటస్థలాల కొరత, తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా.. ఫీజుల వసూళ్లలో పోటీపడి మరీ వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడి అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా.. గరిష్ఠంగా రూ.1500 మించి ఉండదు. అన్ని కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కేజీ, యుకేజీ తరగతులకే రూ.3 వేలు వసూలు చేస్తుండగా, పెద్ద తరగతులకు రూ.8 వేలు నుంచి రూ 10 వేల వరకు వసూలు చేస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఒకరిద్దరూ ఫిర్యాదు చేసినా తర్వాత తమ పిల్లలను పాఠశాల యాజమాన్యాలు వేధిస్తాయోమోనన్న ఆందోళన నెలకొంటోంది.

ఓ సాధారణ బడ్జెట్ స్కూల్స్‌లోనే ధరలు ఇలా ఉంటే.. అదే కార్పోరేట్ స్కూల్స్‌లో ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. చదువుల పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాలు పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఉద్దేశంతో కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్‌లకు పంపిస్తున్నారు. ఇలాంటి స్కూల్స్ చేసే దోపిడిపై నిలదీసే ధైర్యం ప్రభుత్వాలకు, పార్టీల నేతలకు లేకపోవడం దారుణం.

తిరుపతి భవాని నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్లో స్టేషనరీ ధరలు ఇలా..

యూనిఫాం (ఒక జత)	రూ.1500 - 3000
బెల్ట్	రూ.150 - 200
టై	రూ.100 -150
బ్యాగు	రూ.700 -1500
లంచ్‌బాక్స్	రూ.200 - 450
షూస్	రూ.500 -1250
టెక్ష్, నోట్ బుక్స్	రూ.3000 - 10వేలు

వారు అడిగినంతా ఇవ్వాల్సిందే : బి సింధు, కొర్లగుంట, తిరుపతి

'నాకు ఇద్దరు పిల్లలు. మా చెల్లెలికీ ఇద్దరు. మా పిన్నికి ఒకరు. మొత్తం మా ఇంట్లోనే ఐదుగురు పిల్లలున్నారు. ఇద్దరు పిల్లలు ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్నారు. ఒకరు మూడో తరగతి, మరొకరు రెండవ తరగతి చదువుతున్నారు. ఇంకొకరు 8వ తరగతి. వీరంతా భవానినగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. ప్రారంభానికి ముందే ఇద్దరికి నూతనంగా అడ్మిషన్ తీసుకున్నాము. ముందే ఒక టర్మ్ ఫీజు చెల్లింపుతో పాటు అడ్మిషన్, ఆక్టివిటీ, రిజిస్ట్రేషన్‌ఫీజులు చెల్లించాము. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఇతర స్టేషనరీ సహా షూలు, బ్యాగులు, లంచ్ బాక్సు, టై, బెల్ట్, డైరీలు ఇక్కడే తీసుకోవాలని చెప్పారు. ఒక్కొక్కరికి సగటున స్టేషనరీ ఫీజులే దాదాపుగా 13వేలు అవుతోంది. మేము చిన్నప్పుడు చదువుకున్న మొత్తం చదువుకు కూడా ఇలా నగదు ఖర్చుచేయలేదు. ఇప్పుడు తప్పని పరిస్థితిలో పిల్లలను చదివించుకోవాల్సి వస్తుంది. బహిరంగ మార్కెట్లో లభించే ధరతో పోలిస్తే ఇక్కడ మూడు రెట్లు ఎక్కువే. అయినా తప్పక తీసుకోవాల్సి వస్తోంది.

తిరుమలలో భౌతిక, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

మూడంచెల భద్రత మరింత కట్టుదిట్టం

ప్రజాశక్తి - తిరుమల



మారుతున్న కాలానుగుణంగా సరికొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించు కుంటూ తిరుమల శ్రీవారి ఆలయ భద్రతను పటిష్టం చేసేలా టిటిడి ఏర్పాట్లు చేస్తోంది. భౌతిక,సైబర్ సెక్యూరిటీపై కేంద్ర రాష్ట్ర భద్రత అధికారులు ద్వారా టిటిడి అధ్యయనం చేయిస్తోంది. భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రపంచంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రతను తిరుమలలో ఉండేలా టిటిడి చర్యలు చేపట్టింది. వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తిరుమలకు నిత్యం 60 వేల నుంచి 75 వేల వరకు భక్తులు వస్తుంటారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల పుణ్య క్షేత్రంలో మూడంచెల భద్రత ఉన్న ఎక్కడో ఒకచోట లోపం జరుగుతూనే ఉంది. దర్శన టికెట్ల అమలు నుంచి భద్రత పరమైన అంశాల వరకు ఏదో రకంగా వార్తల్లో నిలుస్తోంది. మారుతున్న కాలానుగుణంగా టిటిడి అనుసరిస్తున్న వర్చువల్ విధానం అత్యంత పటిష్టమైన సైబర్ నేరగాళ్లు ఏదో రకంగా నకిలీ టికెట్లను రూపొందించి మరి భక్తులను మోసగించిన సంఘటనలు చాలా వరకు వెలుగులోకి వచ్చాయి. మూడంచెల భద్రత తిరుమలలో ఉందనీ చెప్పుకునే అధికారులు గంజాయి, మద్యం వంటివి తరలివస్తున్న నియంత్రించలేకపోతున్నారు. మొన్నటికి మొన్న శ్రీవారి ఆలయంలోకి ఓ యువకుడు మొబైల్ ఫోన్ తీసుకొని వెళ్ళి మరి ఆనంద నిలయాన్ని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం, ఉగ్రవాదులు తిరుమలలో సంచరిస్తున్నట్లు నకిలీ మెయిల్ రావడం, సిఎంవో స్టిక్కర్ గల వాహనం మాడ వీధుల్లో రావడం వంటివి భద్రత గూర్చి పలు అనుమానాలు కోట్లాది మంది భక్తులలో ఆందోళనలు కలిగిస్తున్నాయి. తిరుమలలో మూడంచెల భద్రతను పటిష్టం చేసేందుకు టిటిడి అడుగు ముందుకు వేసింది. తిరుమల భద్రతపై ముఖ్య అధికారిగా రాష్ట్ర హెూం ప్రిన్సిపాల్ సెక్రెటరీ హరీష్ కుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. రెండు రోజులగా స్థానిక అన్నమయ్య భవనంలో టిటిడి భద్రత అధికారులు, ఇంటెలిజెన్స్, పోలీస్ ఉన్నత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

స్థానిక అన్నమయ్య భవనంలో తిరుమలలో భద్రత ఏర్పాట్లుపై సెక్యూరిటీ ఆడిట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిటిడి భద్రత విభాగంతో పాటు రాష్ట్రం నుంచి పలువురు ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఆధునిక టెక్నాలజి సాయంతో తిరుమలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామన్నారు. సీసీటీవీ కంట్రోల్ రూమ్ లో కృత్రిమ మేధను ఎలా వినియోగించాలి, ఎలాంటి సాఫ్ట్ వేర్ ను వాడాలి అనే అంశాలపై అధ్యయనం చేస్తామన్నారు. అదేవిధంగా యాంటీ డ్రోన్ టెక్నాలజీ, బాడీ స్కానర్స్ వినియోగంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని రాష్ట్ర హెూం ప్రిన్సిపాల్ సెక్రటరీ హరీష్ గుప్తా తెలిపారు. తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపడానికి ఎస్పీ లేదా ఏఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏడు కమిటీలు ఏర్పాటు చేశామని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి అన్నారు..ఈ కమిటీల్లోని అధికారులు 15 రోజుల పాటు పరిశీలన జరిపి నివేదిక సిద్ధం చేస్తారని, మరోసారి సమావేశమై సమీక్షిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత కమిటీలు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామని డీఐజీ తెలిపారు.

వైసీపీకి ఎస్సీవీ గుడ్ బై..!

తిరిగి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం
తాజాగా విజయవాడలో చంద్రబాబుతో భేటీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడనున్నారు. ఆ మేరకు ఆయన తిరిగి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 24వ తేదీన ఎస్సీవీ నాయుడు విజయవాడలో టీడీపీ అధినేత నారా చంద్రబాబుతో భేటీ అయ్యారనీ, ఆయన పార్టీలో చేరేందుకు బాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఎస్సీవీ అనుచరులు బాహాటంగా చెప్పుకోవడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. ఈ నెలాఖరు లోగా ఎస్సీవీ తన అనుచరగణంతో టీడీపీలో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో ఉన్న తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున బాబు సమక్షంలో టీడీపీ లో చేరుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే శ్రీకాళహస్తి రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకోనున్నాయి. అధికార పార్టీ వైసీపీకి పెద్ద ఎదురు దెబ్బేనని చెప్పుకోవాలి.

శ్రీకాళహస్తి రాజకీయాల్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తర్వాత అంతటి రాజకీయ చతురత కల్గిన ఏకైక వ్యక్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడనే చెప్పుకోవాలి. అధికారంలో ఉన్నా..లేకపోయినా..!! పదవిలో ఉన్నా..లేకపోయినా ప్రజల్లో ఆయన చరిష్మా ఏమాత్రం తగ్గకపోవడమే అందుకు తార్కాణం. అయితే దశాబ్దకాలంగా తీవ్ర రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న శ్రీకాళహస్తి పెద్దాయన ఎస్సీవీకి ఏదీ కలిసి రావడం లేదు. నమ్ముకున్న పార్టీలు నట్టేట ముంచుతున్నాయి. వస్తాయన్న పదవులు, ఇస్తారన్న టెక్కెట్టు ఏదీ దక్కడం లేదు. దీంతో ఆయన వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని గట్టిగానే నిర్ణయం తీసుకున్నట్లు తీసుకున్నారు. అయితే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా? లేక వైసీపీ, టీడీపీ కాకుండా ఇంకేదైనా పార్టీ నుంచి బరిలోకి దిగుతారా..? అన్న మీమాంషలో ప్రజలు ఉండగా ఆయన బాబును కలవడం రాజకీయ చర్చకు దారి తీస్తోంది. ఒక వేళ ఆయన టీడీపీలో చేరితే ఎమ్మెల్యేగా టిక్కెట్టు ఇస్తారా అన్న దానిపై స్పష్టత లేదు. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితులు దష్ట్యా సమగ్ర సర్వే జరిపి బొజ్జల సుధీర్ లేక, ఎస్సీవీకి టిక్కెట్టు కేటాయిస్తారన్న చర్చ కూడా నడుస్తుండటం గమనార్హం.



తాజాగా చంద్రబాబును కలిసిన ఎస్సీవీ నాయుడు

నేడు, రేపు సచివాలయ ఉద్యోగులకు పరీక్ష : డిఆర్ఓ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారిచే సచివాలయ ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్ష 26, 27 తేదీల్లో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఉదయం డిఆర్ఓ ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై మాట్లాడుతూ జిల్లాలో కారుణ్య నియామకంలో సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 5, విఆర్ఓ గ్రేడ్ 1, 2, సీనియర్ సహాయకులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈనెల 26న నాలుగు షిఫ్ట్‌లలో 480 మంది, 27న మూడు షిఫ్ట్‌లలో 347 మందికి ఆన్‌లైన్ పరీక్ష రాయనున్నారని తెలిపారు. పోలీసు బందోబస్తు, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ సమీక్షలో ఎపిపిఎస్సి సెక్షన్ ఆఫీసర్ నవ్యజ్యోతి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ నాగజ్యోతి , ఎస్.ఎస్.డిజిటల్ శ్రీధర్ , ఎస్.బి. చంద్ర శేఖర్ , ఆర్‌టిసి డి.ఆర్.నాయుడు , ఎస్.పి.డిసి ఎల్ గణపతి , డిటిలు చెంచయ్య, యుగంధర్ , అధికారులు పాల్గొన్నారు.

రెండో ఫేజ్ గ్రౌండింగ్ పూర్తి చేయాలి

తిరుపతి టౌన్ : జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాలలో రైతుల విస్తీర్ణానికి సంబంధించిన వివరాల డేటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేసేలా చూడాలని సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్‌లను ఆదేశించారు. గురువారం విజయవాడ సి.సి.ఎల్.ఏ. కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సర్వే రాళ్లు నాటే ప్రక్రియ, జగనన్నకు చెబుదాం, గ్రౌండ్ ట్రూతింగ్, విలేజ్ సర్వే వివరాల డేటా ఎంట్రీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి ఇంఛార్జి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కన్ఫరెన్స్ అనంతరం ఇంఛార్జి జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాలలో రైతుల భూమి విస్తీర్ణానికి సంబంధించిన 291 గ్రామాల రైతుల భూముల డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. మొదటి దశ సర్వే రాళ్లు నాటే ప్రక్రియ 69 గ్రామాలలో పూర్తయ్యిందని, రెండవ దశలో సర్వే రాళ్లు నాటే ప్రక్రియ 12 గ్రామాలకు గాను 3 గ్రామాలలో పూర్తి కాగా మిగిలిన గ్రామాలలో నిర్దేశించిన గడువులోపు సర్వే రాళ్లు నాటే ప్రక్రియ పూర్తి కావాలని అన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి -బాలాయపల్లి

మండలంలోని గొట్టికాడు గ్రామంలో దళితులైన తైదుపాటి గురవమ్మ, కందాటి బెంజిమెన్ లకు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన భూస్వాములు పుచ్చలపల్లి హరి, శ్రీనివాసులు రెడ్డి లపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బాలాయపల్లి తహశీల్దార్ శ్రీనివాసులుకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాధితులుతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు సర్వే నంబర్ 224/ 1,224/2 లలో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం వారు అసైన్మెంట్ పట్టా ఇచ్చారన్నారు. అయినా ఆ భూములు ను అగ్రవర్ణాల వారు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, బాలాయపల్లి పోలీస్ స్టేషన్ లో, బాలాయపల్లి తహసీల్దార్ కు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికా రులు స్పందించి దళితుల భూమి ఆక్రమించిన వారిపై ఎస్ సి, ఎస్ టి, అట్రాసిటీ కేసు నమోదు చేసి దళితుల భూమి దళితులకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.



బస్సు ప్రమాదంపై విచారణ : టిటిడి చైర్మన్

తిరుమల : ఘాట్ రోడ్డులో బుధవారం జరిగిన బస్సు ప్రమాదంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. డౌన్ ఘాట్ రోడ్డులో కాంక్రీట్ తో రీటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గురువారం చైర్మన్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు, ఇందుకు దారి తీసిన కారణాలు ఏమై ఉండొచ్చు అనే అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. బస్సులో సాంకేతిక ఇబ్బందులేమీ లేవని ఓలెక్ట్రా సంస్థ ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు సమాచారం ఇచ్చారన్నారు. అతి వేగం లేదా డ్రైవర్ నిర్లక్ష్యం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని, దీని పై విచారణ జరపాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దయ వల్ల బస్సులోని ప్రయాణీకులెవరికీ పెద్ద గాయాలు కాలేదన్నారు. తిరుమలకు వచ్చిన భక్తులను క్షేమంగా తిరుపతికి చేర్చడానికి టీటీడీ అన్ని భద్రతా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇలాంటి ప్రమాదాలు మరోసారి జరక్కుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే విద్యుత్ బస్సుల డ్రైవర్లకు మరోసారి శిక్షణ ఇప్పించాలని చైర్మన్ సూచించారు. టీటీడీ సివిఎస్వో నరసింహ కిషోర్, రవాణా విభాగం జిఎం శేషారెడ్డి, ఆర్టీసీ ఆర్ ఎం చెంగల్ రెడ్డి, ఓలెక్ట్రా విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలో జరుగుతున్న వేసవి క్రీడాకారుల శిక్షణ శిబిరాలు స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సయ్యద్, తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ గురువారం సందర్శించారు. ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్ లో జరుగుతున్న ఫుట్ బాల్ ఉచిత శిక్షణ శిబిరానికి ఉచితంగా స్పోర్ట్స్ అథారిటీ నుండి బాల్‌లను ఎన్ ఐ ఎస్ కోచ్ కే వినోద్ కి అందించారు. అనంతరం ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్ లోని హాకీ ఉచిత శిక్షణ శిబిరాన్ని సందర్శించి వారికి ఉచిత ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఎన్ ఐ ఎస్ కోచ్ ఉన్నాలినికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ క్రీడాకారులందరూ ఈ వేసవి కాలంలో అతి జాగ్రత్తగా ఉండాలని అందరూ ఐదు నుంచి ఆరు లీటర్ల పరిశుభ్రమైన నీటిని తాగాలని ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో విశ్రాంతి తీసుకోవాలని కోరారు. సయ్యద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఉచిత శిక్షణ శిబిరాలకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు.





కార్డియోవాస్కులర్ కేర్‌లో..ఆస్టర్ నారాయణాద్రి అగ్రగామి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రపంచస్థాయి వైద్య సేవలు అందిస్తున్న ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ మరో అడుగు ముందుకు వేసి కార్డియోవాస్కులర్ కేర్‌తో అగ్రగామిగా వైద్య సేవలు అందిస్తోందని ఆ హాస్పిటల్ ఎండి డాక్టర్ సునంద కుమార్ రెడ్డి తెలిపారు. రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాయలసీమ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న నారాయణాద్రి హాస్పిటల్, ఆస్టర్ వారితో అనుసంధానమైన తరువాత అన్ని విభాగాలలో పూర్తిస్థాయి డాక్టర్స్ ను పెట్టుకోవాలనే ఉద్దేశంతో, కార్డియోథోరాసిక్ వాస్క్యులర్ సర్జరీలో అత్యంత నైపుణ్యం కలిగిన డాక్టర్ త్రిలోక్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. తద్వారా అతిక్లిష్టమైన బీటింగ్ హార్ట్, కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్(సిఎబిజి), ఆఫ్ పంప్ బీటింగ్ సర్జరీ తదితర కార్డియాక్ సర్జరీలకు సంబంధించిన అన్ని ప్రత్యేకమైన విధానాలను అత్యాధునిక పరికరాలతో విజయవంతంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ సర్జరీలన్నింటినీ ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, వర్కింగ్ జర్నలిస్టులు పథకాలు, టిపిఏ ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అత్యవసర సమయంలో ఇంటర్నేషనల్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సిద్ధంగా ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ త్రిలోక్ పొందూరు మాట్లాడుతూ వచ్చిన నెల రోజుల్లోనే దాదాపు 14 సర్జరీలను విజయ వంతంగా నిర్వహించడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. అన్ని విభాగాలు ఒకే దగ్గర ఉండడం వల్లే ఈ సర్జరీలు విజయవంతంగా చేయడానికి దోహదపడిందన్నారు. అందులో ఒక రోగికి మూడు బ్లాక్స్ ను బైపాస్ సర్జరీ ద్వారా ఒకేసారి విజయవంతంగా శస్త్ర చికిత్స చేసి నేడు పూర్తి ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేయడం జరిగిందన్నారు. బీటింగ్ హార్ట్ పద్ధతి ద్వారా గుండె, ఊపిరితిత్తుల యంత్రాన్ని ఉపయోగించకుండా, దానితో సంబంధం ఉన్న సంభావ్య ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎస్ వి ప్రసాద్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యన్, ఆస్టర్ వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు 'ఈ'చలానా రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తిరుపతి నగరంలో ఆటో కార్మికులకు 'ఈ'చలానా రద్దు చేయాలని సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ట్రాఫిక్ డిఎస్‌పి పోలీసు స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. డిఎస్‌పికి వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ కార్మికులతో ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరిస్తామని, సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, జిల్లా నేతలు టి.సుబ్రమణ్యం, లక్ష్మి, ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి తంజావూరు మురళి మాట్లాడుతూ తిరుపతిలో ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందని, డీజిల్ ధరలు, నిత్యావసర సరుకుల భారం వల్ల ఆటో కార్మికులు బాడుగలు చెల్లించలేని పరిస్థితని, స్కూలు ఫీజుల, కరెంట్ ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇవి చాలదన్నట్లు ట్రాఫిక్ పోలీసులు 'ఈ'చలానాల పేరుతో ఇష్టానుసారంగా జరిమానాలు విధిస్తే ఎలా అని ప్రశ్నించారు. లైసెన్స్ గడువును జూన్ నెలాఖరు వరకూ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్, సిఐటియు హాకర్స్ నగర ప్రధాన కార్యదర్శి పి.బుజ్జి, హమాలీ యూనియన్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.



ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాల నిర్వీర్యం



ప్రజాశక్తి-వాకాడు: చిట్టమూరు మండలం మెట్టు గ్రామంలో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు కలిసి అక్రమ ఇసుక నిల్వలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గణపర్తి కిషోర్‌నాయుడు మాట్లాడుతూ స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి ఇసుకను అక్రమంగా తరలించడంతో చిట్టమూరు మండలంలోని ప్రజలకు తాగునీరు, సాగు నీరు, నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మాజీ శాసన సభ్యులు, పాశం సునీల్‌కుమార్ సూచనల మేరకు చిట్టమూరు మండలం మెట్టు గ్రామంలో ఇసుక రీచ్ వద్ద మండల నాయకులు, కార్యకర్తలతో కలసి అక్రమంగా తవ్వుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే ఆపాలన్నారు. దీంతో భూగర్భ జలాల నిల్వలు పెరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మన్నెమాల జనార్దన్‌రెడ్డి, గుండుబోయిన కస్తూరయ్య, చిన్నారావు, సునీల్ రెడ్డి , బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రవీంద్ర పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంగమాంబ సచివాలయం పరిధిలోని అక్కంపేట గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తమ దష్టికి రావడంతో గ్రామ సర్పంచితో పాటు సమస్య పరిష్కార మార్గం చేపట్టేందుకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం వచ్చిన పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయని.. విద్యుత్తు అంతరాయం కారణంగా వారం రోజుల నుంచి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారన్నారు. బాలాయపల్లి విద్యుత్ శాఖ ఏఈ జహీర్ అహ్మద్‌కు సమాచారం అందించి వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. జిల్లా అధికారుల దష్టికి తీసుకెళ్లి సైడ్ డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు కషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి బాపనపల్లి వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్ తరుణ్ తెలిపారు. గురువారం పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో నీటి నాణ్యత పరీక్షపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఇందిరమ్మ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా.ఏఈ వెంకట్ తరుణ్ మాట్లాడుతూ నాణ్యమైన నీటితోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి గ్రామానికి నీటి నాణ్యతను పరీక్షించే పరికరాలను పంపిణీ చేసిందని.. వాటిని తప్పకుండా వినియోగించి ప్రజలందరికీ సురక్షితమైన నీటిని అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతికి నివాళులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కనకంపాళెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అయోధ్య నాయుడు హఠాత్తుగా మతిచెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, మాజీ సర్పంచ్ వాజ్‌పేయ్ నాయుడు, వడమాలపేట టిడిపి నాయకులు ధనుంజయులు నాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పిల్లల భద్రతపై తల్లిదండ్రుల నిఘా



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పుత్తూరు సీనియర్ న్యాయవాది మురుగేషన్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవం సందర్భంగా పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి , మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్‌సీ రాఘవేంద్రరావు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వరంలో స్థానిక ఎన్జీవో కాలనీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మురుగేషన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-సత్యవేడు: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు త్రివిక్రమరావు కోరారు. తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట సత్యవేడు తాలూకా ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. ఏపీసీపీఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి తాలూకా యూనిట్ సెక్రటరీ శ్రీనాథ్, ట్రెజరర్ బాష, ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయప్రసాదరావు, సెక్రటరీ మునిరవికుమార్ తదితరులు హాజరయ్యారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం వరదయ్యపాళెంలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాలంటీర్లు చేస్తున్న సేవ దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలని, దేశంలో ఇతర రాష్ట్రాలు వారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం వాలంటీర్లను సన్మానించారు. అనంతరం ఇటీవల రాష్ట్ర దేవంగా కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన తిలక్ బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలాధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బంగారంపేట, కానూరు రాజుపాలెం, తాల్వాయిపాడు గ్రామాల సచివాలయ వాలంటీర్లకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, ఎంపీటీసీ సుజాత, ఈవోపీఆర్డి విజయమ్మ, అన్నపూర్ణమ్మ, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కోట : గ్రామ వాలంటీర్లు ప్రజలకు వారధిగా ఉంటూ నిత్యం సేవలందించాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం



కోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఉప్పల ప్రసాద్ గౌడ్, మండల సచివాలయం కో ఆర్డినేటర్, ఎంపీటీసీ మొభీన్‌బాషా, నాయకులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి, శ్రీరామ్, గురుస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

హరిపురం నిర్వాసితులకు పట్టాలివ్వాలి



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: పేరూరు పంచాయతీ హరిపురం కాలనీలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న స్థానికులకు పట్టాలు మంజూరు చేయాలని తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని డిమాండు చేశారు. 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని" కార్యక్రమంలో భాగంగా 33వ రోజు హరిపురం కాలనీలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పేరూరు అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ గోపి, కాయం వెంకటేష్, ముని హేమంత్ రెడ్డి, రంగనాథ్, నాగరాజ్, మహేష్ రాయల్, లక్ష్మి ప్రసన్న కుమార్, అనిల్ రాయల్, వెంకటేష్, నటరాజ్, కిరణ్ కుమార్, జ్ఞానేశ్వర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, మురళీ హర్ష, ముంతాజ్ బేగం, లక్ష్మి, మున్న, కోకిల, సహిన భాను తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు న్యాయంగా ఉండాలి



ప్రజాశక్తి-కోట: రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణల తొలగింపుల విషయంలో అధికారులు న్యాయబద్ధంగా చర్యలు తీసుకోవాలని మాజీ టిడిపి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం ఆయనతోపాటు టిడిపి నాయకులు కోట పట్టణంలోని ఆక్రమణల తొలిగింపు, ప్రభుత్వ భవనాల తొలిగింపులపై పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు, గ్రీన్ ఫౌండేషన్ అధినేత తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని చింతగుంట పంచాయతీ నాగినేనివారిపల్లి–సిద్దుగారిపల్లి మధ్యలోని రోడ్డు మార్గంలో చెట్లలో కుళ్లిన మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ తులసీరామ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నెరబైలు ఎస్టీ కాలనీకి చెందిన పాపులమ్మ అలియాస్ మంజుల (25)గా తన తల్లిదండ్రులు గుర్తించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిత్యాన్నదానానికి లక్ష విరాళం


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి ప్రకాశం జిల్లాకు చెందిన కొమ్మలపాటి రాంబాబు కుటుంబం గురువారం రూ.లక్ష విరాళంగా అందజేసింది. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా దాత కుటుంబం కోరింది. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు.

రీ-సర్వే పనులు పూర్తిచేయాలి



ప్రజాశక్తి-ఓజిలి: రీ సర్వే పనులు వెంటనే పూర్తి చేయాలని.. ఆర్డీవో చంద్రముని రనాల్ సూచించారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో భూ రీ సర్వేపై సమీక్ష సమావేశంలో ఆర్డివో చంద్రముని రనాల్ పాల్గొని భూ రీ సర్వే ప్రక్రియ చేపట్టి చాలా రోజులవుతున్నా పూర్తి కాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాజుపాలెం, కాజ్జిమేడు, బట్టకనుపూరు, గుర్రంకొండ, పెద్దపరియ గ్రామాల్లో శుక్రవారం నుంచి హద్దుల్లో రాళ్లు నాటే కార్యక్రమం ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తాహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, డిప్యూటీ తాహశీల్దార్ పవన్ కుమార్, మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఓజిలి తహశీల్దార్‌గా ద్వారకనాథ్‌రెడ్డి



ప్రజాశక్తి-ఓజిలి: ఓజిలి మండల తహశీల్దార్‌గా ద్వారకనాథ్‌రెడ్డి గురు వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. తహశీల్దారును వైసీపీ నాయకులు, మానమాల ఉపసర్పంచ్ ఉచ్చూరు హరినాథ్ రెడ్డి, గద్దగుంట పంచాయతీ నాయకుడు పాపాడి రవీంద్రనాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు.

భాకరాపేట సంతలో అన్నదానం



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: నియోజకవర్గంలోని సంతల్లో రైతులకు, వ్యాపారులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం భాకరాపేట వారపు సంతలో వారి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకిరి భూపాల్, భాకరాపేట డివిజన్ అధ్యక్షులు తమ్మిశెట్టి గురుశంకర్ , చిన్నగొట్టిగల్లు వైస్ ఎంపీపీ సునీత దాము, వైస్ సర్పంచ్ ఉమామహేశ్వర, నాయకులు నాగప్ప , ముత్తం శెట్టి మధు, మైనార్టీ సెల్ అధ్యక్షులు షాబాద్ అలీ ఖాన్, మహిళా మండలాధ్యక్షురాలు కళావతి, వార్డుమెంబర్ ఆకులమణి, రామయ్య, నాయకులు మల్లేశ్వర, డిష్ బుజ్జమ్మ, అరుణ్ కుమార్‌రెడ్డి, రజని, శారద, లోశెట్టి రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్టు



ప్రజాశక్తి-తొట్టంబేడు: వరదయ్యపాళెం మండలంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన అసిస్టెంటు లైన్‌మెన్ బోలపాటి వెంకటేశ్వర్లు (63) హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు తెలిపారు. గుప్త నిధుల కోసం నిందితులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ఆయన చెప్పారు. తొట్టంబేడు పోలీసు స్టేషన్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు హత్య కేసు వివరాలు తెలిపారు. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్ లో ఎలక్ట్రికల్ డిపార్టుమెంటులో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదవీ విరమణ చెందిన బోలపాటి వెంకటేశ్వర్లు మిస్సింగ్ పైన ఆయన సోదరుడు బోలపాటి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీయన్ కండ్రిగ సర్కిల్ ఇన్స్పెక్టర్ యన్. విక్రమ్ ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. వరదయ్యపాళెం మండల కేంద్రం బజారువీధికి చెందిన పసుపులేటి విజయకుమార్ అలియాస్ విక్కి (35), వరదయ్యపాళెం మండలం అంబూరు యానాది సెంటరుకు చెందిన తుపాకుల చిన్న పుట్టయ్య (35), చావలి లింగమనాయుడుపల్లెకు చెందిన పోలూరు మహేష్ (25), వరదయ్యపాళెం మండలం బీసీ కాలనీకి చెందిన కాసుల లోకేష్ (21)ను మొదట అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన పసుపులేటి దుర్గాప్రసాద్ అలియాస్ ఠాగూర్ (21), వరదయ్యపాళెం మండలం చావాలి లింగమనాయుడుపల్లెకు చెందిన తుపాకుల చెల్లయ్య అలియాస్ ప్రకాష్ (23)లను అదుపులోకి తీసుకున్నారు. బీయన్ కండ్రిగ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, ఎస్సై మంజునాథరెడ్డి, తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర, సత్యవేడు సీఐ శివ కుమార్, వరదయ్యపాలెం ఎస్ఐ నాగార్జున రెడ్డిలను అభినందించారు.

ఆలయాల్లో బియ్యపు మధుసూదన్ దోపిడీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి ఆలయాలు, గోపురాలు దోచుకుంటున్నారని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో ఉన్న శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఆలయం పునర్నిర్మాణం పేరుతో మూల విరాట్టు కింద ఉన్న బంగారు నాణేలను బియ్యపు మధుసూదనరెడ్డి కొట్టేశారన్నారు. ఈ విషయం తాను బహిరంగంగా ప్రజలకు చెప్పినందుకు ఆయన తనపై రూ.100 కోట్లకు పరువు నష్టం దావా దాఖలు చేశారన్నారు. తాజాగా కైలాసగిరుల్లోని పనసకోనలో ఉన్న శివాలయంలో నందీశ్వరుని గుప్త నిధుల కోసం తొలగించాలరన్నారు. ఇందులో వైసీపీ నేతల హస్తం ఉందని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ నేతల హస్తం లేకపోతే ఈ సంఘటన జరిగి వారం రోజులు అవుతున్నసప్పటికీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి పనసకోన శివాలయం పరిశీలించడానికి ఎందుకు వెళ్లలేదని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. ఇక రాజీవ్‌నగర్ లో ఎపుడో ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దు చేసి వైసీపీ నేతలు ఆక్రమిం చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పేదలకు ఇచ్చిన ఇళ్లను ఆక్రమించు కోవడం బాధాకరమన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాజీవ్ నగర్ లో బాధితులకు అందరికీ న్యాయం చేస్తామన్నారు. ఇక అన్యాయాలు, అక్రమాలు గురించి కేవలం రాజకీయ పార్టీల నేతలే మాట్లాడాలని ప్రజలు భావించడం బాధాకరమన్నారు. ప్రజలు ప్రశ్నించడానికి ముందుకు రావాలన్నారు. టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఇటుక రాళ్లు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: జగనన్న లే అవుట్లలో నిర్మితమవుతున్న గహాలకు మట్టి ఇటుకలు, సిమెంట్ రాళ్లను అందుబాటులో తక్కువ ధరకే సరఫరా చేయాలని ఇటుక బట్టీల యజమానులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలతోపాటు తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి వడమాలపేట, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, ఏర్పేడు మండలాల తహశీల్దార్లతో, ఇటుక బట్టీల యజమానులతో కలెక్టర్ సమీక్షించారు. పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఇటుక బట్టీల యజమానులు సహదయంతో సరసమైన ధరలలో ఇటుకలను అందించాలని తెలిపారు. ఇటుకల బట్టీలు, సిమెంట్ రాళ్ల తయారీకి బట్టీల యజమానులు ఇసుక తోలుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు కనక నరసారెడ్డి, రామారావు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇంజినీర్లు, లే అవుట్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజమండ్రిలో ఈనెల 27, 28వ తేదీల్లో జరిగే మహానాడుకు తరలిరావాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజమండ్రిలో జరిగే మహానాడుకు రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా లోకేష్

ప్రజాశక్తి- తొట్టంబేడు: కడపకు చెందిన పొలకల లోకేష్ శ్రీకాళహస్తి రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా ఈనెల 22న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం విలేకర్లతో మాట్లాడారు. అటవీ భూములు కాపాడుతానని.. ఖాళీ ప్రదేశాలలో ఎర్రచందనం మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన మిషన్ లైఫ్ ఈవెంట్స్ కార్యక్రమంలో భాగంగా రోజూ మూడు బీట్ల కెళ్లి కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు.

వెంకటగిరిలో దోబీఘాట్లు ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరిలోని కాశీపేట ఏరియాలో సీఐటీయూ కార్యాలయం వద్ద సుబ్రహ్మణ్యం అధ్యక్షతన గురువారం రజక వత్తిదారుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ రజకులపై సమాజంలో కులవివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. ఇప్పటివరకు పాలించిన ప్రభుత్వాలు రజకుల భద్రతకు ఓ ప్రత్యేక సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయలేదని, రజక కుటుంబాల్లో చదువుకున్న యువతీ యువకులకు ఉపాధి చూపే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని, రజక యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని, పట్టణ మున్సిపాలిటీ కేంద్రాల్లో మోడ్రన్ దోబీ గాట్ల నిర్మాణం చేయాలన్నారు. తెలంగాణ గవర్నమెంట్ ఇచ్చిన విధంగా రజక వత్తి ఇస్త్రీ చేసే వాళ్లందరికీ 250 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని, 50 సంవత్సరాలు పూర్తయిన రజకులకు పెన్షన్లు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 90 శాతం సబ్సిడీతో 25 లక్షల రుణం బ్యాంకుల్లో ఇవ్వాలని, అర్హులైన ప్రతి రజక కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జోరేపల్లి దిలీప్ కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షులు నిమ్మనపల్లి మునిరత్నం, సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకురాలు లీలావతి తదితరులు పాల్గొన్నారు.